స్పర్శ నీకు కలుగుతుంది. మీరు సాధన చేసి ఏ బంధాలు అయితే తెంచుకోవాలనుకొంటున్నారో నీ బుద్ధి విశాలమయినపుడు ఆ బంధాలు అన్నీ నీ ప్రయత్నం లేకుండానే తెగిపోతాయి. ఆత్మ చాలా సింపుల్‌గా ఉంటుంది. కానినీ బ్రెయిన్ కాంప్లికేట్ చేస్తోంది. ఆత్మ ఎంత సింపుల్‌గా ఉందో, ఎంత నార్మల్‌గా ఉందో, ఎంత సహజంగా ఉందో నీ నడవడిక అంత సింపుల్‌గా, నార్మల్‌గా, నేచురల్ ఉంటే దానిని నీవు తెలుసుకోవటం కాదు అదే నీకు ఎరుక పడుతుంది. ఆత్మను మనం తెలుసుకోలేము. మన మీద అనుగ్రహం చూపించి అది మనకు తెలియబడాలి.

అవతారపురుషుడి యొక్క ప్రేమ, జ్ఞాని యొక్క ప్రేమ ఒక జాతికిగాని, ఒక కులానికి గాని పరిమితమై ఉండదు. సృష్టి అంతటికి పంచి పెడతాడు. మనకు ప్రేమ ఉంటుంది అది కుటుంబ సభ్యులకుపరిమితమై ఉంటుంది. కాని జ్ఞాని యొక్క ప్రేమ పరిమితమై ఉండదు. కొంతమంది ఇంటిలోని వారి మీద కోపంతో ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోతారు. అప్పుడు ఇంట్లోవారి మీద ద్వేషం ఉంటుంది. అది నిన్ను బంధిస్తుంది. లోకం మీద ప్రేమతో ఇల్లు విడిచి వెళ్ళావు అనుకో అది నిన్ను బంధించదు. ఇంటిలోని వారి మీద ద్వేషంతో కాకుండా సమాజంలో పని చేయటం కోసం, ప్రేమ యొక్క పరిధులు పెంచుకోవటం కోసం ఇల్లు విడిచి పెట్టి వెళ్ళావు అనుకో సమాజం కోసం ఇల్లు విడిచిపెడితే, సమాజ సేవచేస్తే ఆ రకంగా పోజిటివ్‌గా పనిచేస్తే నీవు తప్పని సరిగా తరిస్తావు. ఉన్నచోటనే ఉండు. నీవు ఏపని చేస్తున్నావో ఆపని చేసుకో. బాహ్యంగా నీవు చేసే పని మామూలుగా చేసుకొంటూ లోపల అభివృద్ధికోసం ప్రయత్నించు.

**(భీమవరంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 17-11-97)**

## ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఒక హైస్కూలు హెడ్మాష్టర్ భగవాన్ దగ్గరకు వచ్చి నేను పిల్లలకు పాఠాలు చెప్పవలసివస్తోంది, వారిని క్రమశిక్షణగా ఉంచవలసివస్తోంది ఇలా నామనస్సుకు ఎక్కువపని చెప్పవలసి వస్తోంది. అది ఎలా నిర్మలమవుతుంది. మీరు అనుమతిస్తే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేస్తాను అప్పుడు సాధనకు నాకు టైము ఉంటుంది అని అడిగారు. వద్దు అని చెప్పారు భగవాన్. నీలోపల భగవంతుడు ఉన్నాడు. నీలోపల ఒక శక్తి ఉంది. నీప్రారబ్ధం ప్రకారము నిన్ను నడిపేది, నిన్ను ఆ ఉద్యోగంలో నియమించింది ఆ శక్తే. దానికి శరణాగతి పొందు. పొట్ట గడవటం కోసం ఏదో పనిచేయాలి. ఇతరుల మీద ఆధారపడితే బానిసత్వం వస్తుంది. ఆ పనిలో ఏ శక్తి అయితే నిన్ను నియమించిందో ఆశక్తిని ఆరాధిస్తే పనిపూర్తి అవుతుంది, ఆశక్తిని పొందుతావు. నీవు చేసేపని ఇష్టంగా చెయ్యి, ప్రేమగా చెయ్యి, నీవు చేసేపని కష్టంగా చేస్తే వచ్చే జన్మలో అదే మరల నిన్ను చుట్టుకొంటుంది. పనిని శ్రద్ధగా చేస్తే ఇటు పొట్ట వెళ్ళిపోతుంది అటుమోక్షం వస్తుంది. పనిని బలవంతంగా వదిలివేస్తే ఇటు పొట్టకూ కష్టమే అటు మోక్షంరాదు. ఇహానికి చెడతావు, పరానికి చెడతావు.

ఇప్పుడు నీ మనస్సు దృశ్యాల చుట్టూ తిరుగుతోంది. ఈ దృశ్యాలు అన్నీ మనోకల్పితం. నీ మనస్సును

దృశ్యముల నుండి ఉపసంహరించి, ఉపసంహరించి మనస్సును తీసుకొని వచ్చి ఆత్మయందు నిలబెట్టు. అంతా మనస్సే. నీవు బాగుపడినా, చెడిపోయినా మనస్సే దృశ్యం ఏదో రోజు నశిస్తుంది. అది ద్వైతం యొక్క కల్పన. ప్రపంచంలో ఎక్కడ చూసినా ద్వైతమే. నీవు ఎన్ని సాధనాలు చేసిన అసత్యం నశిస్తుందిగాని సత్యం నశించదు, దృశ్యం నశిస్తుందిగాని ఆత్మనశించదు. ఉన్నదిఅదే. అందువలన దృశ్యముల వైపు పరుగిడుతున్న నీమనస్సును ఆత్మకు స్వాధీనం చెయ్యి, గురువుకు స్వాధీనం చెయ్యి. దృశ్యముల నుండి విడుదల చేసి నీమనస్సును అంతర్ముఖ పరచేవాడే గురువు. మనస్సు తనమూలంలోనికి వెళితే తత్వం తనంతటతానుగా దర్శనం ఇస్తుంది. ఇప్పుడు మనం అనుభవించే ఆనందం విషయానందం. విషయానందం విషముతో సమానము అన్నారు ఆచార్యులవారు శివుడిని తెలుసుకొంటే శివానందం కలుగుతుంది. మనోమూలం తెలిస్తే శివుడు తెలుస్తాడు. ఎవరైనా మనకు సహాయంచేస్తే వారిపట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. వారిని మర్చిపోకూడదు. అలా చేయటంవలన ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు.

ధనం, చదువు మంచివికావు, చెడ్డవికావు. వాటిని మనం ఉపయోగించుకోవటంలో ఉంటుంది. మనం బాగుపడటానికి, పవిత్రులు అవ్వటానికి వాటిని ఉపయోగించుకోవాలి. నీకు ధనం ఉంది అనుకో. ఉంటే ఉండనీ నాకు ధనం ఉంది అని అనుకోకు. ఆత్మకు తెలియకుండా ఆధనం నీకు రాలేదు. అందువలన ఆత్మధ్యాస కలిగిఉండు, ఎరుక కలిగిఉండు. అప్పుడు ఆధనం వలన నీకు పొగరుబోతుతనం రాదు. పరమాత్మను మరచిపోయి ధనంతో తాదాప్యం చెందుతూ ఉంటే నీకు బోగదృష్టి తప్ప యోగదృష్టి నీకు రాదు. ఏ ఆత్మ అయితే నీకు ధనాన్ని ఇచ్చిందో, చదువును ఇచ్చిందో దాని ఎరుక కలిగి ఉండు. ఆత్మతో తాదాప్యం విడిచిపెట్టవద్దు. పనిచేసేటప్పుడు దానిని మర్చిపోకు. నేను హెడ్మాస్టరును అని అనుకోవద్దు. అది ఉద్యోగం, అది పరమార్థం కాదు. నేను ఆత్మను అనుకో. నీవుచేసే పనిచేసుకో. ఏచైతన్యం అయితే నీకు ఉద్యోగం ఇచ్చిందో దానితో తాదాప్యం విడిచిపెట్టవద్దు, దాని ఎరుక కలిగి ఉండు. ఏ ఈశ్వరుడు అయితే నీకు ఉద్యోగంఇచ్చి సంపాదన కలుగజేసాడో వాడిని మర్చిపోకు, వాడి దృష్టి కలిగి ఉండు.

మనం ఏదైనా మాట్లాడేటప్పుడు ఎదుటివారి అహంకారానికి గాయం తగలకుండా హితవుగా, మితంగా, వారికి అర్థమయ్యేటట్లుగా మాట్లాడాలి. గాయం తగిలేటట్లు మాట్లాడితే మనం చెప్పేది వినరు సరికదా ఎదురుతిరుగుతారు. నీవు పనిచేసేటప్పుడు ఈశ్వరచింతనకలిగిఉండు. దానినిమర్చిపోవద్దు. అంతే నీవు చేయవలసింది మిగిలినది ఆయనే చూసు కొంటాడు. మాటమాటకి తొందరపడకు, కంగారుపెట్టుకోవద్దు. చేసేపని నెమ్మదిగా, జాగ్రత్తగా, స్థిరంగా చెయ్యి. పనిచేస్తూ జపంచేయటం, ధ్యానం చేయటం నేర్చుకో. నీకు ఇష్టమైన భగవంతుని నామం నీనోటిలో కాపురం ఉండాలి. అహంకారపూరితులు పనిచెయ్యరు, చేస్తున్నట్లు నటిస్తారు. ఇంక వారికి జ్ఞానం ఏమిటి? నీవు ఏపని చేస్తున్నా భగవంతుని విడిచిపెట్టకుండా ఉంటే అలాచేయగా చేయగా నీమనస్సు నిర్మలం అవుతుంది, నిశ్చలంఅవుతుంది. కామాన్ని, కాలాన్ని జయిస్తావు. అప్పుడు భగవంతుడు ఆయన

స్వరూపాన్ని నీకు ఇస్తాడు. నీవు ఆత్మదగ్గరకు వెళ్ళుఅని మనస్సుకు చెపితే అదివెళ్ళదు. మనస్సు నిర్మలమైతే, నిశ్చలమైతే, దానికి శాంతి, కలిగితే బాహ్యముఖానికి విజృంభించకుండా అంతర్ముఖమవుతూ దానికి సపోర్టుగా ఉన్న ఆత్మవైపుకు నెమ్మదిగా జరుగుతూఉంటుంది. లోపల ఉన్న ఆత్మచూస్తూ ఉంటుంది. ఈ మనస్సు లోపలకు జరిగి, జరిగి ఎప్పుడయితే ఆత్మ యొక్కనోటికి అందిందో మనస్సును మింగేసి తనస్వరూపాన్ని మనకు ఇస్తుంది. అప్పుడు అఖండంగా ఉంటాము. ఈజననమరణ ప్రవాహము నుండి విడుదల పొందుతాము. ఇంకజన్మతో పనిలేదు. ఒకవేళ భగవంతుడు పంపితే రావలసి ఉంటుంది. అలా వచ్చినా తాను దేహంకాదు అని వాడికి తెలుస్తూ ఉంటుంది కాబట్టి దేహం వాడిని బంధించదు.

మాయవిషయాలు, బడాయి గొడవలు వద్దు. ఈ మెరుపులనుచూసి ఈశ్వరునిమర్చిపోవద్దు, ఈబడాయి గొడవలలోనికి వెళ్ళిఅసలు వస్తువును మర్చిపోవద్దు. నీకు అసలైనచుట్టం, పెద్దచుట్టం పరమేశ్వరుడే. ఆపెద్ద చుట్టాన్ని వదిలివేసి చిల్లర చుట్టాల్ని పట్టుకుంటున్నావు నిరంతరము నీకు ఎవరితో సంభంధం ఉందో వారిని మర్చిపోతున్నావు. తాత్కాలిక విషయాలను పట్టుకొంటున్నావు. జ్ఞాపకంపెట్టుకోవలసిన విషయాన్ని మర్చిపోతున్నావు. దేనినైతే మర్చిపోవాలో దానిని జ్ఞాపకం పెట్టుకొంటున్నావు. దేనిని గుర్తు పెట్టుకొంటే చింతవస్తుందో దానినిగుర్తు పెట్టుకొంటున్నావు. పరమేశ్వరుని ధ్యానించుకొంటూ ఉంటే, పరమేశ్వరుని గుర్తు పెట్టుకొంటే చింతాకంత చింతకూడా నీకు ఉండదు పనిచేసేది నీవు అని ఊహించుకోవద్దు. ఇది అంతా నావల్ల అవుతోంది అని కర్తృత్వం పెట్టుకోవద్దు. పరమేశ్వరుడు నిన్ను ఆపనియందు నియమించాడు. ఎంతకాలం ఆపనిచెయ్యాలో అంతకాలం చేసెయ్యి. పరమేశ్వరుని రెండుచేతులతో పట్టుకోవాలి అనుకొంటున్నావు. రెండు చేతులతో పట్టుకొనే రోజు వస్తుంది. కంగారు పడకు. ముందు ఒక చేత్తో పట్టుకోవటం నేర్చుకో. తరువాత రెండు చేతులతో పట్టుకోవచ్చు. కొంతమంది పనిచేస్తారు. ఏమీ చేయనట్లుగా నిర్మలంగా ఉంటారు. ఎవరైనా వచ్చి మీరే ఆపని చేసారు, మీవలననే ఆపని అయ్యింది అనిఅంటే ఈ అహంకారము వలన ఆపని అవుతుందా ఈశ్వరానుగ్రహం వలన అయ్యింది అంటారు. అదివారి మంచితనానికి గుర్తు.

ఏదో ఒక జన్మలో మీరు కర్మచేసి కర్మఫలాన్ని త్యాగంచేసిఉంటే మీముఖం జ్ఞానం వైపుకు తిరుగుతుంది గాని లేకుంటే తిరగదు. మీరుచేసిన సత్కర్మ, నిష్కామకర్మ మీకూడా వస్తుంది, మిమ్మల్ని ఉద్ధరిస్తుంది. నీదృష్టిని ఒక నామానికో, ఒకరూపానికో పరిమితం చేయవద్దు, అఖండ దృష్టిని అలవర్చుకో. నీలోపల ఉన్న జ్ఞానవాహినితో, ప్రేమవాహినితో తాదాప్యం చెందు, దానితో అనుబంధం పెట్టుకో. అంతర్వాహినితో సంబంధం పెట్టుకో. నీవు కంగారుపడవద్దు. నీవుచేసే వృత్తినీకు ఏవిధంగాను అవరోధం అవ్వదు. యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టవద్దు. నీస్వార్థాన్ని కొంచం వదులుకొని ఇతరుల మేలుకోసం పనిచెయ్యి అది యజ్ఞంతో సమానము. దానం అంటే కేవలం ధనం సహాయం చేయటమేకాదు మీ తెలివితో ఆపదలో ఉన్నవారిని కాపాడితే అదికూడా దానమే.

నీవు అనుభవించే భోగాలను తగ్గించుకోవటంకూడా తపస్సుతో సమానము. దేహం మరణించిన తరువాత భోగివెళ్ళేలోకాలువేరు, యోగివెళ్ళేలోకాలు వేరు. యోగి మహావెలుగు ఉన్న లోకాలకు వెళతాడు. భోగి చీకటి లోకాలకు వెళతాడు. విషయానందం తగ్గాలి అంటే అది తగ్గదు. తత్వదృష్టిని పెంచుకొంటేనీకు విషయదృష్టి తగ్గుతుంది. ఆత్మానందం రుచి నీకు తెలిసినపుడు విషయానందం నుండి బయటకు వస్తావు.

ఈశరీరం ఎంతకాలం అయితే ఉంటుందో అంతకాలం ఈశ్వరానుగ్రహం పొందటం కోసం పనిచెయ్యి. వాంఛఉన్నవాడు ఆవాంఛను నెరవేర్చుకోవటం కోసం రాత్రి పగలు అని తెలియకుండా కష్టపడి ఎలా దానికోసం జీవిస్తాడో అలాగ దైవానుగ్రహం సంపాదించటం కోసం నీవు జీవించినంత కాలం పనిచెయ్యి. ఎప్పుడు చనిపోతాము అని చావుకోసం ఎదురుచూడవద్దు. ప్రతీ చిన్న విషయానికి భయంపెట్టుకోవద్దు. జరగవలసినది జరుగుతుంది. నీవు చేసే పని శ్రద్ధగా చెయ్యి. అనుకొనేది జీవుని సంకల్పం జరిగేది ఈశ్వరసంకల్పం. దేవునిఅనుగ్రహం కోసం ఈ శరీరం శవం అయ్యేవరకు కష్టపడి కృషిచేసుకో, మనస్సు బయట విషయాల మీదకు వెళ్ళకుండా చూసుకో. నీ దేహం ఏ టైములో ఎక్కడ ఉండాలో ఏపనిచేయాలో అది నీచేతిలో లేదు. దేహప్రారబ్ధాన్ని బట్టి అది ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటుంది. దాని గొడవ వదిలివెయ్యి. కాని నీచేతలో ఉన్నది ఒక్కటే నీకుమంచి జరిగినా, చెడుజరిగినా, నిన్ను విమర్శించినా, పొగిడినా వాటికి చలించకుండా సమానంగా ఉండటానికి ప్రయత్నించు. నీవు ఎక్కడ ఉన్నావు, ఎలా ఉన్నావు అనేది ముఖ్యంకాదు. నీమనస్సుకు ఎంత వరకు అంతర్దృష్టి కలుగజేస్తున్నావు, నీహృదయం యొక్క లోయలలో ఉన్న అంతర్వాహిని దగ్గరకు నీ మనస్సును ఎంత వరకు తీసుకొని వెళుతున్నావు అనేది ముఖ్యం. సుఖము, దుఃఖము, రాగము, ద్వేషము ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన వికారములు. ఇవి అన్నీ కాలప్రవాహములో కొట్టుకొనిపోతాయి. అందుచేత అంతర్దృష్టి పెట్టుకొని మనస్సును లోపలకు మళ్ళించి చైతన్య స్రవంతిలోనికి తీసుకొని వెళితే అందులో అది ఐక్యమవుతుంది. నీవు విడిచి పెట్టవలసినది బయట ఏమీ లేదు. ఈ దేహంతో చేసేపని విడిచిపెట్టనక్కరలేదు. నీవు విడిచిపెట్టవలసినది లోపలే ఉంది. నేనుచేస్తున్నాను అనే తలంపును విడిచిపెట్టు. బయట విడిపెట్టి లోపల విడిచిపెట్టకపోతే ఒకటి లేని సున్నలతో సమానము. దేహబంధువులు వేరు, ఆత్మబంధువులు వేరు. దేహ బంధువులు లాంచనాలకే పరిమితం ఆపదలో మనలను కాపాడేవారు ఆత్మబంధువులు. మనకు జన్మ వచ్చింది అంటే మనలో ఎంతో కొంత అజ్ఞానం ఉంది అని అర్ధం. మనలో అజ్ఞానం లేకపోతే జన్మరాదు. మీకు ఎంత ధనం ఉన్నా, ఎంత గౌరవము ఉన్నా, ఎంత అంగబలంఉన్నా, భగవంతుని పాదాల మీద భక్తి లేకపోతే అంతా సున్నా. భగవంతుని మీద భక్తి ఉంటే మరణానంతర జీవితంలో ఉపయోగపడుతుంది గాని నీకు ఎంత గౌరవం ఉన్నా దేహం ఉన్నంత సేపు తప్ప మరణానంతర జీవితంలో ఉపయోగపడదు. ఈ గౌరవాలు ఎక్కువగా స్మరించుకొంటూ ఉంటే అహంకారము పెరుగుతూ ఉంటుంది.

**(శ్రీ నాన్నగారి ప్రవచనము ఫిబ్రవరి 1 వ తేదిన గుమ్ములూరులో జరుగును)**